


# నిస్వార్థ

ఎ.ఎ. రమణారావు

'చిక్కమ్మ ఇంకా రాలేదేం?'

వీథిలోకి వచ్చి, ఆ మాట అనుకోవటం అది యాభయ్యోసారి సరళకి. సాయంత్రం ఆరవుతూంది. చలి కాలం పొద్దు మూలాన్న అప్పుడే చీకటి ఆవరించుకుని వస్తూ ఉంది. నల్లటి మబ్బులు ఆకాశంలో కమ్ముకుని. ఏ క్షణాన విరుచుకుపడతాయో అన్నట్టున్నాయి. దానికి తోడు గాలి. ఈదురు గాలి. ఆ గాలికి చెట్లు భయం కొలుపుతూ ఊగుతున్నాయి.

సరళకి మనసు మనసులో లేదు.

'పాప లేస్తుందేమో!' గుబగుబ లాడుతున్న గుండెతో లోపలికి పోయి చూసింది సరళ.

పాప ఇంకా నిద్ర పోతూనే ఉంది.

'అమ్మయ్య!' అనుకుంది సరళ. మళ్లీ వీధిలోకి వచ్చి చూసింది. కనుచూపు మేరలో ఎక్కడా చిక్కమ్మ కనిపించలేదు.

'చిక్కమ్మ రాదా? రాకపోతే ఏం చెయ్యాలి?' సరళ కళ్లలో నీళ్లు తిరిగాయి.

'భగవంతుడా! చిక్కమ్మ వచ్చేటట్టు చెయ్యి, నీ పాపం ఎరగని చంటిదానికి అపకారం చెయ్యకు.' మనసులోనే ప్రార్థించింది సరళ. మబ్బులు మరింత మూసుకున్నాయి.

'టప్! టప్!' చినుకులు సన్నగా ప్రారంభం అయ్యాయి. కాసేపటికి వర్షం ముంచుకువచ్చేసింది. సరళకు దుఃఖం ముంచుకుని వచ్చింది.

'ఇంకేం వస్తుంది చిక్కమ్మ! భగవంతుడా! చిక్కమ్మ రాకపోతే ఏం చెయ్యాలి?'

నీరసంతో సరళకి కళ్లు తిరుగుతున్నాయి.

'ఈ సమయంలో ఆయనుంటే? పాపం మూడు రోజులయింది ఆయనెళ్లి. ఎక్కడ తిరుగుతున్నారో ఏం చేస్తున్నారో?

వీధి గుమ్మాన్నానుకుని కూర్చుండిపోయింది సరళ. ఆమె మనసులో ఆలోచనలు సుళ్లు తిరగసాగాయి.

'భగవంతుడు కొందరి జీవితాలనెందుకిలా సృష్టిస్తాడు? తను పుట్టి బుద్ధెరిగిందగ్గర్నించీ కష్టాలంటే ఎరగదు. ప్రాణాల్ని ఏం చేసి ఇచ్చేసిన అమ్మా, నాన్నా, తను తిట్టినా, కొట్టినా, నెత్తికెక్కి కూర్చున్నా, చిరునవ్వుతో అన్నీ భరించిన అన్నయ్య. వాళ్ల ఆప్యాయతల మధ్య ఇరవై సంవత్సరాలు ఎలా గడిచిపోయాయో తనకే తెలియదు. వయసొచ్చింతర్వాత, ఆ ఇంట్లో అన్ని సుఖాలూ ఉన్నా, ఏదో లేదనే కొరత, తపన పీడించడం మొదలెట్టేసరికి, శేఖరం తన జీవితంలో ప్రవేశించాడు. ఎందరో ఆస్తీ, ఐశ్వర్యమూ ఉన్న పెళ్లికొడుకుల్ని తండ్రి పట్టుకొస్తే, వాళ్లందరినీ కాదని, చేతిలో చిల్లిగవ్వ లేని శేఖరంతో జీవితాన్ని పంచేసుకుంది తాను. తనకి శేఖరం ఎందుకు నచ్చాడో ఎవరికీ అర్థం కాలేదు. అయినా తన ఇష్టప్రకారమే అన్నీ జరిపించారు తల్లీ, తండ్రీ.

శేఖరంలోని పసిపిల్లాడి మనస్తత్వం, కపటం లేని హృదయం, అనురాగానికి ఆలయమైన మనసు, వాటికి కట్టుబడిపోయింది తాను. పెళ్లయిన మూడేళ్ల వరకూ శేఖరం కురిపించిన ఆప్యాయత, ప్రేమ, అనురాగం, తను ఈ జన్మలో మరిచిపోగలదా! అయితే ఆ తర్వాతే, జీవితం కొంచెం మలుపు తిరిగింది. అప్పటి వరకూ శేఖరం, అంటిపెట్టుకుని ఉన్న చిన్న ఉద్యోగం, నాలుగు నెలల క్రితం పోయింది. శేఖరం మళ్లీ ఉద్యోగాల వేటలో పడ్డాడు. లోపల ఏదో అలికిడి అయినట్టయి సరళ లోపలకి తొంగి చూసింది. పాప పక్కకి తిరిగి పడుకుంది. అంటే కదిలిందన్నమాట. ఇక నిద్ర లేచే వేళయింది. లేచిందంటే? అమ్మో!

సరళ కలవరపడుతూ వీథిలోకి వెళ్లింది. వర్షం జల్లులు జల్లులుగా పడుతూంది. రోడ్డు మీద నీళ్లు పొర్లి ప్రవహిస్తున్నాయి. ఉండండి మెరపులు మెరుస్తున్నాయి. బాగా చీకటి పడిపోయింది. వీధి దీపాల గుడ్డి వెలుగులో చీకటిని చీల్చుకుని సాధ్యమైనంత దూరం చూసింది సరళ. చిక్కమ్మ కనిపించలేదు.

'చిక్కమ్మ రాకపోతే, ఈ చీకటి రాత్రి, పాపతో ఏం చెయ్యాలి? సరళకి దుఃఖం ఆగలేదు. కళ్ల వెంట నీళ్లు కారిపోసాగాయి. అలాగే గుమ్మాన్నానుకుని ప్రతిమలా ఉండిపోయింది సరళ. ఆమె మనసులో ఒకటే కోరిక. 'చిక్కమ్మ రావాలి.'

కాని చిక్కమ్మ ఎందుకు వస్తుంది? అసలు రావాల్సిన అవసరం ఆమెకేం ఉంది.

రెండు నెలలైంది చిక్కమ్మ డబ్బు తీసుకోకుండా పాలు పోస్తూ. అది మాత్రం ఎన్నాళ్లు పొయ్యగలదు?

గొడ్డూ, గోదా మేపుకోవాలి. వాళ్ల డొక్కలు నిండాలి. పాలమ్మిన డబ్బు చేతికి అందకపోతే వాళ్ల బతుకులు మాత్రం ఎలా తెల్లారుతాయి?

పది రోజుల నించీ చిక్కమ్మ చెప్తూనే ఉంది, డబ్బివ్వకపోతే ఇంక పాలు పొయ్యనని! ఈ రోజుతో మానేసి ఉంటుందా?

'భగవంతుడా! ఈ ఒక్క రోజు, ఈ ఒక్క రోజు, చిక్కమ్మని వచ్చేటట్టు చెయ్యి.'

ఈ ఒక్క రోజులో ఏం జరుగుతుంది? అయితే సరళ మనసులో దానికి సమాధానం లేదు. ఇలాంటి రోజులు ఎన్ని గడవలేదు?

మనిషి మనసు విచిత్రమైనది. కష్టాలు వచ్చినప్పుడు ఆ ఆపద గడిచిపోతే చాలనే తపన ఒక్కటే ఆ మనసులో ఉంటుంది. అలాంటి ప్రవృత్తికి అతీతమైనదేమీ కాదు సరళ. సరిగ్గా అదే సమయానికి...

** ** **

వర్షం జల్లులు జల్లులుగా పడుతూనే ఉంది.

ఈదురుగాలి రివ్వున ముఖాన కొడుతూంటే, చిక్కమ్మ ఒక చేత్తో పాల చెంబు గట్టిగా పట్టుకుని, రెండో చేత్తో చీర కొంగుతో ముఖం తుడుచుకుంటూ కష్టంగా

అడుగులు వేస్తూంది.

'ఎదవ వాన ఈయాల ఇట్టా పట్టుకుందేం?' అనుకుంది చిరాగ్గా చిక్కమ్మ. ఆమె నడుం కొంచెం వంగిపోయి ఉంది. ఇటీవల చూపు కూడా సరిగా ఆనటంలేదు.

'ఇంక బగమంతుడు తొందరలో తీసుకుపోతాడేమో' అన్న ఆలోచన చిక్కమ్మ మనసులో మెదిలింది. గుండె ఎందుకో దడదడలాడింది.

'సరళమ్మ గ్గోరిల్లు ఇంకో ఫర్లాంగు దూరం ఉంటుందేమో' అనుకుంది చిక్కమ్మ. అలా అనుకునేసరికి ఒంట్లోకి కొంచెం సత్తువ వచ్చినట్టయింది. చిక్కమ్మకు. వర్షపు నీటితో తడిసిపోయిన చేతిలోంచి పాల చెంబు ఎప్పుడు జారిపోతుందో అన్న భయం కలిగింది చిక్కమ్మకు. అందుకే ఆ పాల చెంబుని మరింత గట్టిగా అదుముకుని అడుగులు వేసింది చిక్కమ్మ. ఆమె మనసులో ఆలోచనలు ముసురుకున్నాయి.

నిన్న సాయంత్రం, డబ్బివ్వకుండా ఇంక పాలు పొయ్యనని చెప్పడానికి తను వెళ్లినప్పుడు...

ఎప్పుడూ నవ్వుతూ కేరింతలు కొడుతూ ఉండే చంటిది. గుక్క పట్టి ఏడుస్తూంటే ఆయమ్మ సముదాయిస్తూంది.

'ఎందుకమ్మా సంటిబిడ్డ నట్టా ఏడిపిత్తావ్?' అని అడిగితే సమాధానం సెప్పకుండా ఆయమ్మ కంట నీరెట్టుకుంది.

'ఏం సమాధానం సెప్తుంది ఆ తల్లి? సంటి బిడ్డకి పాలు లేవు. సేతిలో డబ్బులు లేవు అని సెప్పగలదా! మానం, మరియాదా ఉన్న మనిషి గాబట్టి గుండెల్లోనే, సీతమ్మోరిలా దుక్కాన్ని దాచుకుంది ఆయమ్మ. ఆకలంటే ఏటో, దరిద్దరం అంటే ఏటో సంటిదానికేటి తెలుస్తాది? ఆ సంటిది ఇలఇల్లాడుతూంటే ఆయమ్మ మనసు ఎలా రగిలిపోయి ఉంటుందో... అట్టాంటి కష్టాలు పడ్డ తనకి గాబట్టి తెలిసింది.

'థూ! ఎదవ డబ్బు? రెండు నెల్లు ఇయ్యలేక పోతే పాయె. దాని కోసం పసిబిడ్డకి పాలు నేకుండా సెయ్యడం కంటే పాపం మరొకటుంటుందా? అట్టాంటి పాపం తనకి సస్తే వద్దు. రాములు గోడు తన పీక నులిమేసినా సరే, ఆయమ్మ కంట నీరెట్టకుండా సూడ్డాలి.'

చిక్కమ్మ మళ్లీ ఓపిక తెచ్చుకుని గబగబా అడుగులు వెయ్యసాగింది.

** ** **


వర్షం కురుస్తూనే ఉంది.

రైలు స్టేషనులో వచ్చి ఆగింది. శేఖరం ఒక చిన్న సూట్ కేసు పట్టుకుని కిందికి దిగాడు. రైల్లోంచి ఇంకెవ్వరూ దిగలేదు. చలి గాలి రివ్వున ముఖం మీద కొడుతూంది. శేఖరం కర్చీపుతో ముఖం తుడుచుకున్నాడు.

వర్షం సూదులతో పొడుస్తూన్నట్టు పడుతూంది. అయినా శేఖరం, నిలబడకుండా ప్రయాణం సాగించేడు.

'తొందరగా సరళనీ, పాపనీ చూడాలి'. వాళ్లని విడిచి మూడు రోజులయింది. కాని అతనికి మూడు యుగాలు గడిచినట్టున్నాయి. 'తనకి ఉద్యోగం వచ్చిందన్న సంగతిని వెంటనే సరళతో చెప్పాలి. అలా చెప్పినప్పుడు ఆమె ముఖంలో వెలిగే వెలుగు చూస్తేనే తనకి తృప్తి. ఆ వెలుగే తనకి జీవనాధారం, ఉత్సాహం, ఊపిరి. పాపం, అన్ని వదలుకుని తనని పెళ్లి చేసుకున్నందుకు అష్టకష్టాలూ పడుతూంది సరళ.

తను వచ్చేటప్పుడు ఇంట్లో చిల్లిగవ్వ లేదు. బియ్యం లేవు, సరకులు లేవు. ఏది ఏమయితే అది అవుతుంది అని తెగించి వెళిపోయాడు తను. సరళ ఈ మూడు రోజులా ఏం చేసి ఉంటుంది?



అతని మనసులోని ఆ ప్రశ్న పైన పడుతూన్న వర్షం కన్నా ఎక్కువ వేధిస్తూంది. తొందరగా ఇల్లు చేరుకోవాలి. శేఖరం అడుగులు తొందరగా వేద్దామని ప్రయత్నించాడు. కాని అది సాధ్యపడటం లేదు. వర్షపు నీరు పాయలు పాయలుగా ప్రవహిస్తూ అడుగులని సరిగ్గా పడనివ్వటం లేదు.

చుట్టూరా చిమ్మచీకటి తాండవం చేస్తూంది. ఎక్కడో ఆరేడు స్తంభాల కొక్కటి చొప్పున మునిసిపాలిటీ లైట్లు బిక్కు బిక్కుమంటూ వెలుగుతున్నాయి. అతికష్టం మీద నడుస్తూన్న శేఖరం హఠాత్తుగా ఆగిపోయాడు.

ఏదో మూలుగు వినబడింది. చుట్టూ చూశాడు. ఏం కనిపించలేదు. అది తన భ్రమేమో అని మళ్లీ అడుగు ముందుకి వేశాడు.

ఈ సారి మూలుగు మరింత గట్టిగా వినబడింది. శబ్దం ఎడమచేతి వేపు ఉన్న కాలిబాట లోంచి వస్తూంది.

శేఖరం అటు వేపు వెళ్లాడు. ఓ పెద్ద చెట్టు కొమ్మ గాలికి విరిగిపడి ఉంది. దాని కింద ఒక ఆకారం పెనుగులాడ్డం లీలగా కనిపించింది శేఖరానికి. దగ్గరకు వెళ్లాడు.

ఎవరో ముసల్ది. రెండు చేతుల్లోనూ గట్టిగా దేన్నో పట్టుకుని ఉంది. పరకాయించి చూసాడు శేఖరం.

అది పాల చెంబు. దాన్నిండా పాలున్నాయి. ఆ ముసల్దాన్ని వదిలేసి వెళిపోదామనుకున్నాడు ఒక్క క్షణం. కాని మనస్సు ఒప్పలేదు. మెల్లిగా ఆ పాల చెంబుని ఆమె చేతుల్లోంచి విడిపించి పక్కన పెట్టాడు.

ఏం చెయ్యాలో పాలు పోలేదు శేఖరానికి.

'ఆస్పత్రికి వెళ్లాలంటే తను వచ్చిన తోవలోనే వెనక్కి వంద గజాలు వెళ్లాలి. ఈ ముసిల్ది నడిచేటట్టు లేదు. తనొక్కడే తీసుకెళ్లాలి. ఈ ఈదురుగాలిలో, వర్షంలో ఆ తోవలో ఇంకెవరైనా వస్తారనుకోవడం కేవలం భ్రమే అవుతుంది.

'ఎందుకొచ్చిన పీడ? దీన్ని ఇంకెవ్వడో ఆదుకుంటాడు.' అలా అనుకుని శేఖరం ఒక అడుగు ముందుకి వేశాడు.

కాని అతనికి మనసెందుకో ఒప్పలేదు. ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకోలేకపోతే తన చదువెందుకు? సంస్కారమెందుకు? ఈ లోకంలో ఎందరో దురదృష్టవంతులుంటారు. ఈ ముసిల్ది బ్రతికినన్నాళ్లూ ఎన్ని కష్టాలు పడిందో. కనీసం చావులోనైనా దిక్కులేని చావు చావగూడదని కాబోలు, చివరి క్షణాల్లో పెనుగులాడుతూంది. తనకయిన ఆలస్యం ఎలాగూ అయింది. ఇంకొక రెండు గంటలు పోతేనేం?

ఆమెని భుజాల మీద కెత్తుకుని సూట్ కేసు చేతుల్లో ఇరికించుకుని అడుగులు వేశాడు శేఖరం.

** ** **

గాలికి లాంతరు ఆరిపోకుండా చుట్టూ గోనె పట్టా కప్పుకుని, అందులోంచి చాలినంత వెలుతురు బయటకు వచ్చేటట్టు పెట్టుకుని, కాలువల్ని దాటుకుంటూ అడుగులు ముందుకి వేస్తున్నాడు రాములు.


ఈ వర్షంలో, ఈ ఈదురుగాలిలో తనిట్టా రావలసివచ్చిందంటే దానికి కారణం ఆ ముసలిముండే. తనత్త, అది సస్తే గాని తనకి శాంతి లేదు. అసలు తన కష్టాలన్నిటికీ అదే ఆ ముసల్దే కారణం. ఈ వర్షంలో దాన్ని ఎక్కడ వెతికేటట్టు? అదింటికి రాకపోతే తన పెళ్లాం ఊరుకోదు. ఆ ముసల్ది పట్టుకెళ్లిన మర సెంబు నూట ఇరవై రూపాయలది. సక్కటి సెంబు. కిందటి తిరనాల్లోకి కొన్నది. కొని ఇంకా ఏడాది కూడా తిరగలేదు. ఆ ముసల్ది సచ్చినా పరవాలేదు. సెంబు దొరికితే సాలు తనకి.

'థూ! సంపుకు తింటన్నది ఈ వర్షం' మధ్యలో ఆది గో నెపట్టా సవరించుకున్నాడు రాములు. లాంతరు ఆరిపోతుందా

"ధర్మచక్రాన్ని ధరించినవాడ్ని
మూడు రంగుల్లో మునిగినవాడ్ని
ఎవడ్రా నా దేశభక్తిని శంకిస్తుంది" అంటూ గద్దించి అడుగుతున్నారు 'తిరంగా ముసల్మాన్' ఎ. రాజాహుస్సేన్.
"నా తాతల రక్తం ఇంకింది ఇక్కడే
నా తరాల త్యాగాలు జెండాలైందీ ఇక్కడే" నని ఆయన గర్వంగా చెబుతున్నారు.
"కాశ్మీరం నుంచి కన్యాకుమారి దాకా
'అల్లాహో' అక్బర్ అజాధ్వనిని
వందేమాతరగీతానికి రసధునిని
నా దేశపు గాలిని శ్వాసగా పీల్చి
శత్రుదేశాన్ని ఊపిరాడకుండా చేసేవాణ్ని
సరిహద్దులే నా 'కంటిపాపలు
నేనే భారతీయం
ఎవడ్రా నా జాతీయతను ప్రశ్నార్థకం చేసేది?" అంటూ ఆయన గుడ్లురుముతున్నారు.
"మేరా జబాఁ హిందూస్థానీ
మేరా ఇమామ్ హిందూస్థానీ,
మైఁ హూఁ తిరంగా ముసల్మాన్" అని చాటుకుంటున్నారు రాజాహుస్సేన్. ముస్లిం కవుల క(గ)లం నుండి గళం నుండి ఇంత ఎసెర్టివ్‌గా, ఇంత పదునుగా, ఇలాంటి మాటలు వెలువడడం బహుశా ఇదే మొదటిసారి.

ఈ సంపుటిలో 46 కవితా ఖండికలున్నాయి. మొదటిది తిరంగా ముసల్మాన్. రాజా హుస్సేన్ పదహారణాల జాతీయవాద ముస్లింగా ఇందులో కనిపిస్తారు. త్రివర్ణపతాకాన్ని సగర్వంగా చేబూనిన ఓ ముస్లిం వర్ణచిత్రం ఈ కవితకు అదనపు ఆకర్షణగా నిలుస్తుంది. కవితాదృష్టితో చూస్తే జాగో భాయ్, సరిహద్దులు దాటిన ఆనందం, ఉగ్రవాదమా తోక ముడు, అల్లా ఒక్కడే, చిరంజీవి నాన్న, అమ్మ పుట్టినూరు, పల్లె జ్ఞాపకాల ముల్లె వంటివి ఎన్నదగినవి. అయితే వాటి సంగతి అలా వుంచి, 'తిరంగా ముసల్మాన్' అనే కొంగ్రొత్త పద బంధమే ఈ కవితాసంపుటిలోని హై లైట్. భారతీయకరణం గురించిన చర్చ నేటిది కాదు. బలరాజ్ మధోక్ వంటివారు ఈ మాట ఏ నాటి నుండో చెబుతున్నారు. తతిమ్మా దేశాల్లోని ముస్లింలు ఆయా దేశాల మట్టి వాసనలను నింపుకున్నారు. ఇండొనేషియా దీనికి చక్కని ఉదాహరణ. అయితే ఏ కారణాల వల్లనైతేనేమి, భారత ముస్లింలు విడిగా ఒక పాయగానే కొనసాగుతూ వచ్చారన్న భావం వుంది.

# తిరంగా ముసల్మాన్




**తిరంగా ముసల్మాన్ (కవితా సంకలనం)**
**రచన:** ఎ.రాజాహుస్సేన్,
**వెల:** రూ.30/-,
**పుటలు:** 48,
**ప్రతులకు:** 1-8-702/33/20ఎ, పద్మాకాలనీ, నల్లకుంట, హైదరాబాద్ -500 044.

అందుకే ముస్లింలనగానే అనుమాన దృక్కులతో చూడడం మొదలైంది. అనేక సందర్భాలలో (భారత-పాక్ క్రికెట్ మ్యాచ్‌లతో సహా) ముస్లింల ప్రవర్తన కూడా దానికి బలం చేకూర్చింది. ప్రభుత్వాల ముస్లిం మైనారిటీ సంతుష్టీకరణ విధానాలు హిందూవాదాన్ని పదునెక్కించాయి. వందేమాతర గీతాన్ని గురించిన రాజా హుస్సేన్ కవితలో వుంది. ఆ గీతాన్ని పాడిన పలు సందర్భాలలో ముస్లిం పెద్దలు అభ్యంతరాలు వ్యక్తం చేసేవారు. ఇప్పుడు రాజాహుస్సేన్ గారు వందేమాతర గీతాన్ని ఆలపిస్తానంటే కాదనేదెవరు? "తిరంగా ముస్లిం" అన్న భావనే హాయిగా ఉంది. ఈ "తిరంగా ముస్లిం"కు హృదయపూర్వక స్వాగతం.

**—వై.ఎస్.ఆర్.**

---

అని పరీక్షగా దాని వేపు చూశాడు. 'పర్లేదు బాగానే ఉంది' అనుకున్నాడు. ఈ అడ్డ తోవలో పడిపోతే తాను సేరాల్సిన చోటు ఇరవై నిముషాల్లో సేరిపోగలడు.

జాగ్రత్తగా అడుగులు ముందుకి వేస్తూన్న రాములు, హఠాత్తుగా ఆగిపోయాడు. చీకట్లో రోడ్డు పక్కన మెరుస్తూన్న వస్తువు వేపు మరోసారి తీక్షణంగా చూశాడు. సందేహం లేదు. అది తన సెంబే. రోడ్డు పక్కని ఉన్న చెంబుని భద్రంగా చేతుల్లోకి తీసుకున్నాడు రాములు. దాన్నిండా పాలు... చిక్కటి పాలు.

'అమ్మయ్య! సెంబు దొరికింది.' తృప్తిగా ఊపిరిపీల్చాడు రాములు. హఠాత్తుగా అతనికి సందేహం కలిగింది. 'ఈ ముసల్దేమైనట్టు?'

ఎక్కడికైనా దేహబాధ తీర్చుకోడానికి కాసేపు పక్కకి పోయిందేమోనని ఒక అయిదు నిమిషాలు అలాగే నిలబడ్డాడు రాములు. ముసిలిదాని జాడలేదు.

'ఏడ సచ్చిందబ్బా ఇది?' ఆ వర్షంలో అక్కడే కాలు గాలిన పిల్లిలా తిరిగాడు రాములు. చివరికి విసుగెత్తి ఇంటికి పోదామనుకుని అడుగు వేశాడు. హఠాత్తుగా మెరపు మెరిసింది. రాముడి మస్తిష్కంలో ఊహ కదిలింది.

'ఇంత ఈదురుగాలుల్లో, వర్షంలో, ఈ ముసల్ది పాలసెంబు పట్టుకుని సరళమ్మ గోరింటికి ఎందుకు బయల్దేరినట్టు? అదే రెండు నెల్ల బట్టే ఆళ్ల డబ్బులు ఇవ్వకుండా ఉంటే...' దీనికేదో కారణం ఉండకుండా ఉండదు. పోనీ ఇంత దూరం వచ్చాడు కదా ఎలాగూ, ఇంకొక్క ఫర్లాంగు దూరం నడిసి సరళమ్మ గోరింటిలో సంగతేంటో కనుక్కుంటే పోలే? గట్టిగా డబ్బులు కూడా అడగొచ్చు. ఈ లోపల ముసల్ది కూడా ఇంటికి సేరిపోవచ్చు. రాములు పాలచెంబు పట్టుకుని సరళమ్మ ఇంటి వేపు అడుగు వేశాడు.

ఆకలితో వెక్కివెక్కి ఏడిచి, అలిసిపోయి తన భుజం మీద తల వాల్చేసి పడుకున్న పాప జుట్టు చేత్తో నిమురుతూ, శిలావిగ్రహంలా గుమ్మంలోనే కూర్చుండిపోయిన సరళను చూడగానే, రాములికి కథ ఒక్క క్షణంలో అర్థం అయిపోయింది.

'అమ్మా! పాలు!' అన్నాడు రాములు.

సరళ ఉలిక్కిపడి కళ్లెత్తి చూసింది. ఆమె కళ్లు మళ్లీ వర్షించసాగాయి.

పాపని హఠాత్తుగా కింద వదిలేసి, రాములు చేతుల్లోని పాల చెంబుని రెండు చేతుల్తో అందుకుని లోపలికి పరిగెట్టింది. కింద వదిలేసిన పాప ఏడవటం మొదలు పెట్టింది. రాములు పాపని ఎత్తుకున్నాడు.

'ఏడవకమ్మా! తెచ్చానుగా పాలు!' అన్నాడు రాములు. వేడి వేడి పాలు తాగిన పాప కళ్లు తెరిచి రాముల్ని చూసి నవ్వింది.

ఆస్పత్రిలో మంచం మీద పడుకున్న చిక్కమ్మ, ఒక్క కన్నీటి బొట్టు రాల్చి కళ్లు తెరిచింది. ●